# సందేశం

బ్రహ్మానందరావు ఆనందానికి అవధుల్లేవు...

ఆనందం పట్టలేక జుత్తు పీక్కుందామనుకున్నాడు...

బట్టతలపై వెండి రంగులో మెరుస్తున్న నాలుగు వెంట్రుకల్లో ఒకటి తగ్గిపోతుందని... భయపడి ఆగిపోయాడు...



"ఏమండీ... అతిధులంతా వచ్చే వేళ యింది... తొందరగా తయారయి చావండి..." రాజేశ్వరి హుకుంతో... ఈ లోకంలోకి వచ్చాడు...

"షష్టిపూర్తి చేసుకునేది చావటం కోసమే మిటే?..." గట్టిగా నిలదీద్దామనుకున్నాడు... 'కొరివితో తల గోక్కోవటమెందు కులే,... అని మౌనంగా ఉండిపోయాడు.

బ్రహ్మానందరావు షష్టిపూర్తి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి... విశాఖపట్నంలోని గురజాడ కళాక్షేత్రం – ఇందుకు వేదికైంది. బ్రహ్మానందరావు కోటీశ్వరుడు... అతని వ్యాపారం అనేక ఇతర పట్టణాలకు సైతం విస్తరించి ఉంది... ఇద్దరు సంతానం. పెద్దకొడుకు వ్యాపారాన్ని అందిపుచ్చుకున్నాడు... ఎం.బి.ఎ. చదవడంతో ఆధునిక దృక్పథాన్ని మేళవించి మరీ బిజినెస్‌ని ఇంప్రూవ్ చేసాడు...

చిన్నకొడుకు ఇంజనీర్... కాలక్షేపం కోసం ఉద్యోగం చేసినా... వ్యాపారమంటే మరింత ఆసక్తి... రాజకీయ నాయకులతో మంచి రిలేషన్‌షిప్ మెయింటెయిన్ చేస్తుంటాడు...

ఆడిటోరియం వేలాదిమంది జనంతో కిటకిటలాడుతోంది... ప్రముఖులంతా హాజరవుతూండటంతో... బ్రహ్మానందరావు ఉబ్బి తబ్బిబ్బయ్యాడు... పత్రికల్లో అభినందన సందేశాలు, భారీగా ప్రకటనలూ రావటంతో – తనలో తానే కొడుకులకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ప్రసంగాల్లో బ్రహ్మానందరావుని ఆకాశానికెత్తాసారంతా!... బండెడు దండల్ని అవలీలగా మెడలో వేసుకొన్నాడు... తన వంతు రాగానే బ్రహ్మానందరావు "ఈ సత్కారం ఓ మంచి తల్లిదండ్రులకు మంచి కొడుకులు చేసినది... చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది... ఈ షష్టిపూర్తి మహోత్సవాన్ని చూసి ప్రతి తండ్రీ పులకించి పోవాలి... ప్రతి కొడుకూ ప్రేరణ పొందాలి... ఇంతటి మహత్కార్యానికి నా బిడ్డలు ఆదర్శనీయులు కావటం నేనెన్నటికీ మరిచిపోలేని అద్భుతమైన విషయం..." తాదాత్మ్యంతో మాట్లాడాడు. సభ చప్పట్లతో మారుమ్రోగిపోయింది...

తదుపరి బ్రహ్మానందరావు పెద్దకొడుకు మైక్ అందుకున్నాడు...

"మా తండ్రిగారి షష్టిపూర్తి మహోత్సవానికి హాజరయిన మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదములు!... మమ్మల్నింతగా తీర్చిదిద్దిన మా తల్లిదండ్రులకు ప్రతీకారంగా... సారీ... కృతజ్ఞతాపూర్వకంగా... సమాజాన్ని జాగృత పరిచే మరో మహోన్నత కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నాం. దానిని కూడా మీరు విజయవంతం చేయాలి. వివరాలు నా సోదరుడు విన్నవిస్తాడు...".

చిన్నకొడుకు సందీప్ వేదిక మీదికొచ్చాడు.

"ఇంతటితో మా తల్లిదండ్రులకు మాతో ఉండవలసిన అవసరం తీరిపోయింది. మమ్మల్ని వారెంత బాగా చూసుకున్నారో... అంతకు రెట్టింపుగా మేము వాళ్లని చూడాల్సిన బాధ్యత మాపైన ఉంది. ఊరేగింపుగా వాళ్లని మనమంతా కలిసి తీసుకువెళ్లాలి. వృద్ధాశ్రమంలో వాళ్లిద్దరికీ కలిపి ఏర్పాట్లు చేసాం..."

బ్రహ్మానందరావు ఒక్కసారిగా అదిరిపడ్డాడు. దాదాపు సీటులోంచి కిందికి జారిపడినంతగా భయపడ్డాడు. తన కొడుకుల వేపు ప్రాధేయపూర్వకంగా చూసాడు. ఈ చివరి కార్యక్రమాన్ని రద్దు చేసేయమని!...

ఎం.వి.జె. భువనేశ్వరరావు

రెండు గంపలు... కావడి సిద్ధమయ్యాయి...

అలనాడు కావడిని ఒక్క శ్రావణుడు మోస్తే... ఈసారి ఇద్దరు శ్రావణులు సురేష్, సందీప్‌లు మోస్తున్నారు...

పుట్టుకతో గుడ్డివాళ్లయిన తల్లిదండ్రులను ఆనాటి శ్రావణుడు మోస్తే... కళ్లుండీ పిల్లల మనసుల్లోని భావాలను చూడలేకపోయిన తల్లిదండ్రులను... సురేష్, సందీప్ మోస్తున్నారు. రెండు గంపల్లో తల్లిని, తండ్రినీ వేరువేరుగా కూర్చోబెట్టారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో మార్మోగుతోందా ప్రాంతం. బాణాసంచా ప్రేలుళ్ళతో మరింత వేడుకగా ఉంది. రోడ్డంతా జనం బారులు తీరి వింతగా చూస్తున్నారు. వందలాది జనం వెంటరాగా - సురేష్, సందీప్‌లు బ్రహ్మానందరావు దంపతులను వృద్ధాశ్రమానికి అప్పగించారు.

"ఏంట్రా సురేష్! ఇదేమైనా బాగుందా?... ఇంట్లోనే హాయిగా మీతో కలిసి ఉండేవాళ్ళంగా... ఇక్కడెలా బ్రతకటం?..."

అమాయకంగా అడిగాడు బ్రహ్మానందరావు.

"మీరు ఎటువంటి టెన్షన్‌లూ లేకుండా... ప్రశాంతంగా ఉండాలనే ఇక్కడకు తీసుకొచ్చాం నాన్నగారూ... మిమ్మల్ని దూరంగా ఉంచి... మేం మాత్రం సంతోషంగా ఉండగలమా?" సముదాయించాడు సురేష్.

"మా కోసం... మమ్మల్ని దూరంగా పంపి... చదివించి... మీరు చేసిన త్యాగం ముందు ఇదెంత డాడీ...? మీరు చూపిన మార్గంలోనే మేం ముందుకు సాగుతున్నాం. వస్తాం మరి!..."

సందీప్ మాటలకు ఖిన్నుడయ్యాడు బ్రహ్మానందరావు.

బ్రహ్మానందరావుకంతా అయోమయంగా ఉంది.

షష్టిపూర్తి మహోత్సవం జరిగాక... హాయిగా తనవాళ్ళతో గడుపుతూ... సంతోషంగా ఉండాలనుకొన్నాడు. తానొకటి తలిస్తే... మరొకటి జరిగింది. తన కొడుకులింత బాహాటంగా... తనని వృద్ధాశ్రమానికి పంపించేస్తారని కలలో కూడా ఊహించలేదు.

తప్పంతా తనదే... ఇన్‌కమ్‌టాక్స్ ప్రోబ్లమని చెప్పి... ఆస్తంతా వారి పేర్న వ్రాయటం వల్లనే ఇంతటి ముప్పు ఏర్పడింది.

రోజంతా భారంగా గడిచింది.

ఆగలేక... ఇక వేగలేక... సురేష్‌కి ఫోన్ చేద్దామని వెళ్ళాడు...


"ఇక్కడి నుంచి ఫోన్ చేయటాన్కి వీల్లేదండీ. ఫోన్ కాల్స్ వస్తే... మేమే మిమ్మల్ని పిలుస్తాం..." చిరాకు పడింది ఆ వృద్ధాశ్రమంలోని ఉద్యోగి.

బ్రతిమలాడాడు బ్రహ్మానందరావు...

"ఈ ఒక్కసారికే"నని ఫోనిచ్చింది...

"నాన్నా... ఇంటికి మరలా వద్దామని ప్రయత్నించకు... నువ్వు ఫోన్ చేస్తే... బిజినెస్ మీదుండే కాన్సంట్రేషన్ దెబ్బ తింటుంది. నువ్వింటికొచ్చావనుకో... పిల్లలు నీతో ఆటలాడుకుని... చదువు ఎగ్గొడతారు. ఈ మధ్యనే ఎల్‌కెజి నుంచే ఐఐటి ఫౌండేషన్ కోర్సులో వాళ్ళని జాయిన్ చేశాం. ఫుడ్ బాగానే ఉంది కదా! ఆరోగ్యం జాగ్రత్త..." కనీసం బ్రహ్మానందరావుని మాట్లాడనివ్వకుండానే... ఫోన్ పెట్టేసాడు సురేష్.

వృద్ధాశ్రమానికి సందీప్ రాగానే... బ్రహ్మానందరావుకి పోయిన ప్రాణం తిరిగొచ్చినట్లు




యింది... రాగానే గట్టిగా కౌగిలించుకున్నాడు... సందీప్ తీసుకొచ్చిన పండ్లు, బట్టల వేపు కన్నెత్తయినా చూడలేదు. "నాయనా... సందీప్... నువ్వయినా మా మాట వినరా... మమ్మల్ని తీసుకుపోరా..." జాలిగా ఉంది బ్రహ్మానందరావు పరిస్థితి.

సందీప్‌కి కూడా బాధగానే ఉంది. అయినా తమాయించుకొని "లేదు నాన్నా... నువ్వక్కడికొస్తే... బిజినెస్ వ్యవహారాలు చూస్తానంటావు... ప్రశాంతంగా ఉండలేవు. ఆరోగ్యం డిస్టర్బవుతుంది. మా చదువు కోసం మీరు త్యాగం చేసారు... ఇప్పుడు మీరు ఆరోగ్యంగా ఉండటం కోసం మేం త్యాగం చేస్తున్నాం... అర్థం చేసుకోండి నాన్నా..." అనునయంగానే చెప్పాడు.

బ్రహ్మానందరావుకు ఆనందం బదులు విచారం కలిగింది. కన్న కొడుకుని ఎదిరించలేదు... కనీసం బెదిరించలేదు. ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితి.

తనెంతగానో ప్రేమించే బిడ్డలకు అప్పుడే భారమై పోయాననే బాధ మరింతగా వేధిస్తోంది. సూటిగా సందీప్‌నడిగేశాడు.

"నేనేం పాపం చేశానని నన్నిలా వేధిస్తున్నారా?... నేనేమైనా తప్పుచేసుంటే సరిదిద్దుకుంటాను..."

"మా క్షేమం కోసం, చదువు కోసం అంటూ మమ్మల్ని హాస్టల్లో ఉంచి చదివించావు... మాకూ నీలానే అన్పించేది... ఇంటికి వెళ్ళిపోవాలని... తల్లిదండ్రుల వద్దే ఉంటూ చదువుకోవాలని!. అలాగని వచ్చేసామా?... కష్టపడి... ఎంతో బాధపడి చదువుకోలేదా?... మేం వచ్చేస్తానంటే ఏం చెప్పేవాడివి?..."

"అయితే నాపై ప్రతీకారం తీర్చుకోవటాన్కి - నన్ను ఇక్కడికి తీసుకొచ్చేరా?... కనీసం నా మనవడ్ని, మనవరాల్ని ఒక్కరోజు ఇక్కడికి

పంపించండిరా..." రిక్వెస్టింగ్‌గా అడిగాడు.

"చెప్పాను కదా డాడీ... వాళ్ళు ఎల్‌కేజి నుంచే ఐఐటి ఫౌండేషన్ కోర్సు జాయినయ్యారు... ఎంతైనా చదువు ముఖ్యం కదా?... బోడి తాతా మనవడు అనుబంధాలు, అందమైన బాల్యం - ఇవేం వాళ్ళని రక్షించవు కదా!..."

సందీప్ మాటలు బాకుల్లా గుచ్చుకొంటున్నాయి.

"అర్థమైంది... నేనే మీకు బాల్యం లేకుండా చేసేనని... మిమ్మల్ని హాస్టల్‌కే అంకితం చేసేనని... మీరు నాపై కక్ష గట్టారు. అందుకే నన్నిలా బాధపెడ్తున్నారు. అంతే కదా!..."

సూటిగా... ఒకింత కోపంగానే అడిగాడు బ్రహ్మానందరావు. సందీప్ మరేం మాట్లాడలేదు.

బ్రహ్మానందరావుకి ఇప్పుడిప్పుడే విషయం అర్థమవుతోంది. తనతోపాటు ఆశ్రమంలోనున్న వాళ్ళందర్నీ కలిసి మాట్లాడాడు. తలొకటీ చెప్పారు.

"నా పిల్లలు ఆస్తి ముట్టగానే... మమ్మల్నిక్కడికి పంపేసారు. వేరే గత్యంతరం లేక ఇక్కడ పడుంటున్నాం..."

"మమ్మల్ని అనాధలుగా చేసి... అమెరికా వెళ్ళిపోయాడు వాడు. ముందు అమెరికా వెళ్తున్నాడని సంతోషించాం... ఎన్నో త్యాగాలు చేసి వాడ్ని చదివిస్తే... ఆ చదువు వల్లనే వాడు మమ్మల్నొదిలి ఎక్కడో ఉంటున్నాడు."

"నాతో వ్యాపారం చేసే రంగారావు తన పిల్లల్ని స్వంత వ్యాపారంలో పెట్టాడు... తన వద్దే ఉంచి చదివించుకున్నాడు. హాయిగా అందరూ కల్సి ఉంటున్నారు." "పిల్లల్ని నమ్మి... ఆస్తంతా తగలేసి చదివించాం. యిప్పుడేమో డబ్బులేక, సరైన ఆధారంలేక... ఈ శరణాలయంలో తలదాచుకొంటున్నాం."

"నెలా నెలా డబ్బు పంపటమే కానీ... మా పిల్లల్ని చూసి ఐదారేళ్ళు గడిచింది."

"పిల్లల అభివృద్ధిని కళ్ళారా చూస్తూ... కళ్ళు మూద్దామనుకొంటే... ఇదిగో నన్నిలా తీసుకొచ్చి ఇక్కడ పడేసారు."

"తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ హాయిగా ఉండటమనేది - హాస్టల్‌లో ఉంచి - వాళ్ళకి మనమే అలవాటు చేశాం... ఇప్పుడు వాళ్ళకు మనతో కలిసి ఉండటం కష్టంగా ఉంటోంది."


ఒక్కొక్క మాట బ్రహ్మానందరావు చెవుల్లో మార్మోగుతోంది. కానీ తన కొడుకులు అటువంటి వారు కాదు. ఎందుకనో ఇవన్నీ చేస్తున్నారు. "నాకు కనువిప్పు కలిగించాలనేమో..." మనసులో ఏదో భావం మెదిలింది. ధైర్యం వచ్చింది. రాజేశ్వరిని తనతో రమ్మన్నాడు. సరాసరి ఇంటి ముందాగింది ఆటో...

ఎదురుగా సురేష్, సందీప్, కోడళ్ళు, మనవళ్ళు...

వాళ్ళని చూడగానే మరలా ఆటో ఎక్కి వెనక్కి వెళ్ళిపోదామనుకొన్నాడు... వారి ముఖంలో వెల్లివిరుస్తున్న ఆనంద మకరందాన్ని... మనో ఫలకంపై ముద్రించుకున్నాడు...

"ఇప్పుడే ఫోన్ వచ్చింది నాన్నా... మీరు అక్కడి నుండి బలవంతంగా బయటకొచ్చేసారని... అందుకే మీ రాకకోసం ఎదురు చూస్తూ... స్వాగతం చెప్పటానికి కుటుంబమంతా నిలబడి ఉన్నాం..."

వాళ్ళ మాటలకి మరలా బ్రహ్మానందరావుకి నిజమైన ఆనందం కలిగింది.




"అయితే నన్ను క్షమించేసారు కదా మీరు... మీరు కోల్పోయిన బాల్యాన్ని మీకు తిరిగివ్వ లేకపోయినా... నా మనవళ్ళకి అందమైన బాల్యాన్ని చవి చూపిస్తాను..."

సురేష్, సందీప్ కల్పించుకుని... "నీలో ఈ మార్పు రావాలనే... ఇంత చేయవలసి వచ్చింది... లేకుంటే నీ మనవళ్ళని కూడా మంచి చదువు కోసం హాస్టల్లో వేసేయమంటా వేమోనని భయమేసింది... మేం కోల్పోయిన అందమైన బాల్యాన్ని, తల్లిదండ్రుల ప్రేమనీ వారు కోల్పోకూడదు... ఇలా ఏ తల్లిదండ్రులూ ప్రవర్తించకూడదనే విషయం - పబ్లిక్ అంత టికీ తెలియాలంటే మీలాంటి ప్రముఖ వ్యక్తి పైన అయితేనే వర్కవుట్ అవుతుందని... గొప్ప పబ్లిసిటీ వస్తుందనీ... మిమ్మల్ని బాధ పెట్టాల్సి వచ్చింది... మమ్మల్ని క్షమించండి నాన్నా..." బ్రహ్మానందరావు కాళ్ళ మీద పడ్డారు... ప్రెస్ కెమెరాలు క్లిక్ మన్నాయ్...

★ ★ ★

"ఏమిటంటీ... ఈ పిచ్చి కలవరింతలు... లేవండి... ఎప్పుడూ పెందలాడే లేచేవారు. ఈ రోజు షష్టిపూర్తి జరుగుతోందనా ఎనిమిదయి నా లేవలేదు? పైగా క్రింద కూడా పడ్డారు."

తట్టిలేపింది బ్రహ్మానందరావుని భార్య రాజేశ్వరి...

అయోమయంగా కళ్ళప్పగించి చూస్తున్నా డు...

రాజేశ్వరి చురచురా చూస్తూ... బెడ్‌రూమ్ లో నుంచి బయటకు వెళ్ళిపోయింది.

"ఇదంతా కలా?... నిజమేననుకొని తెగ భయపడిపోయాను..."

తనలో తానే నవ్వుకున్నాడు. షష్టిపూర్తి రోజున తానివ్వాల్సిన సందేశం కలలోనే రడీ అయిపోయినందుకు ఆ 'గొప్ప స్వప్నాని'కి 'థ్యాంక్స్' చెప్పాడు. ●